# తెలుగు గిరిజనుల వ్యాప్తి - వాఙ్మయం తీరు తెన్నులు

# తెలుగు ప్రాంతాలలో గిరిజన భాషా సాహిత్యాలు

## మార్చి 26, 27, 2016 విశాఖపట్నం, కేంద్ర సాహిత్య అకాదమి సదస్సు

**- 'శక్తి' శివరామకృష్ణ**

గిరిజనులలో ప్రతితెగకు ప్రత్యేకమైన భాష ఉంటుందని స్థిరమైన అభిప్రాయంగల రోజులలో నేను 1976-82లలో తెలుగు గిరిజనులవాఙ్మయం సేకరించి పరిష్కరించాను. ఇప్పటికి 20-30 మంది ఈ రంగంలో పనిచేస్తున్నవారు విశ్వవిద్యాలయాలలో కనిపిస్తుంటారు. బి. రామారాజు, నాగభూషణశర్మ, నటరాజ రామకృష్ణలు, చుక్క సత్తయ్య, చిందు ఎల్లమ్మ వంటి కళాకారులకు గొప్ప గుర్తింపు తెచ్చిపెట్టారు. అటువంటి సంకల్ప బలం నేడు కన్పించదు.

1960లలో భద్రిరాజు కృష్ణమూర్తిగారు అరకులోయలో కొండదొరల భాష అధ్యయనం చేశారు. ఆ భాషకు సాహిత్యపుష్టి లేదని తీర్మానించారు. నేను ఆ పక్కనేగల పాడేరు, చింతపల్లి తాలూకాలలో 'పాండవదేశంలో పాటపూజారులు'గా పేరొందిన అదేతెగ కొండదొరలు, నందిపండుగలో 'జోర జోర జోర పంచపాండవులార' అంటూ వారం రోజులు పాడే 'నంది పదం' సేకరించాను. పండుగచేయడం ఆచారం కాబట్టి ఈపాట ఇంకా బతికేవుంది. మాండలిక వృత్తి పదకోశాలు తయారు చేసేటప్పుడుకూడా ఈ తెలుగు గిరిజనులున్న ప్రాంతాలకు పోలేదు. భాషాశాస్త్రజ్ఞులు ఇప్పటికీ ఈ తెలుగు గిరిజన మాండలికాన్ని అధ్యయనం చేయలేదు. ప్రసిద్ధరచయితలు ఈ ప్రాంతాలలో పనిచేశారు కాని, వారిలో గిరిజనుల సాహిత్యాన్ని ఆస్వాదించిన రసజ్ఞత కనిపించదు. అందువల్ల వారి రచనలలో పుష్టికూడా తక్కువే. చదువుకున్న గిరిజనులు తమ శక్తిమరచి, రక్తివిడిచి ఆ రచయితలనే అనుకరిస్తున్నారు. 'పదమెరుగని పండు పిల్లులు'గా మారుతున్నారు. వాళ్ళను మనం మారుస్తున్నాము. ఒక రచనవల్ల రచయితకు పేరువస్తుందికాని సమాజంలో మార్పు రాదు అని కొడవటిగంటి కుటుంబరావు చురక వేశారు. 'జాతి జీవనాళిక జానపదగీతిక' అంటాడు శ్రీశ్రీ.

### తూర్పు కనుమలలో అడవులు, లోయలు, బయళ్ళు

ఆంధ్రప్రదేశ్‌లోగల యానాది, చెంచు, కొండరెడ్డి, బగత, కొండదొర, వాల్మీకి, కొండకమ్మరి, కొండకాపుల మాతృభాష తెలుగు. జీవ వైవిధ్యంగల తూర్పు కనుమల్లో నల్లమల, ఎర్రమల, వెలిగొండ అడవులలో చెంచులు, యానాదులు ఆహారం, అటవీ ఫలసాయం సేకరించుకుంటారు. గోదావరిలోయల్లో కొండరెడ్లు పోడువ్యవసాయం, విశాఖమన్యం బయళ్ళలో బగతలు పల్లంలో, కొండదొరలు గరువుభూములలో ఆహారంతోపాటు వాణిజ్య పంటలు పిప్పలి, అల్లం, పసుపు, ఒలిసెలు, చిక్కుళ్ళుకూడా పండిస్తారు. 'కొండపోడు కోమటివాడి దుకాణం' అని సామెత. కొండకమ్మరలు వృత్తిపనివారు, కొండకాపులు వ్యవసాయకూలీలు, వాల్మీకులు బారికలు, చెంచులుమాత్రం రెండు రాష్ట్రాలలో ఉన్నారు.

ఈ అడవులన్నిటా నెమలాట పనుకులు, పులి బరుకుడుమాను వంపులు, పికిలిపిట్ట వేనాలు, తూరురాయి కట్టువలు, తియ్యమామిడి గండి, గుమ్మళ్ళదొడ్డి, మగనాలిమెట్ట, చేవడిబస, ఆటబస, గొట్టిబసలలో-

వసంతసంగీతమానులు, లచ్చిమిగల చింతమానులు, నీటి ఒరుగుడుమానులు, అడవికి ఆటగాళ్ళు, కొండకు కోలగాళ్ళు, చేనుకు చేటుగాళ్ళు, ఊరికి ఉద్దెగాళ్ళు, దారికి దడ్డడు, కొమ్మకొమ్మకు సంగటిముద్దలు, పగుళ్ళలోతీపి గల – ఈ వాడలన్నీ చూడగల్ల బయళ్ళు, ఆడగల్ల బయళ్ళు.

ఈ కనుమలు, లోయలు, బయళ్ళు– నూనెకొప్పుల పొన్నచిలుకలు, బొంతచాటు బొబ్బరగువ్వలు, గుండె నిండ వలపులున్న కున్నెపిట్టలు, సూటిగల్ల గేదెపోతులు, డిప్పెమక్కల కొరువలు, వేడుకల ముంగిపిల్లలు, తగిలి పొడిచే పిగినిపిట్టలు, అడ్డపూవు అందగాళ్ళు, కనురెప్పలు గఱులు గట్టే బంటువీరులు, అమ్మలతో ఆటలు, గోవులలో గొట్టి, గుబ్బట్లతో గుమ్మళ్ళతో సందడిగా ఉంటాయి.

**ఓ చుక్కల సురిటిపల్లి చూడగల్ల బయలు**
**వెన్నెల గరుడపల్లి ఆడగల్ల బయలు**
**చుక్కలు తెలివో – చూసేవారు లేరు**
**వెన్నెల తెలిదో – ఆడేవారు లేరు**
**లొల్లాసై రన్నలాల లొల్లొరె లోరె**
**సైలోరె రన్నలాల లొల్లొసై లోరె**

అని విశాఖబయళ్ళలో పాడుతుంటే, గోదావరిలోయల్లో

**అటసిరి కళ్ళములోన ఆడవేడుకలయ్య**
**పాటసిరి కళ్ళములోన పాడవేడుకలయ్య**
**లే లే లేల లేలమ్మారో ఓలే లేల లేల**
**లేలే లేల లేలయ్యారో ఓలే లేలలేల**
**రండో చేరి పాండవులార భోంచేయరండో**

అని కొండరెడ్లు పంటలపండుగలలో పాండవరాజులను ఆహ్వానిస్తారు.

మువ్వలదుడ్డువేస్తూ ఆడే వారి ఈ పాట, జాతీయయువగీతం కాదగినది.

**ఆట మనదే పాట మనదే – అన్ని విద్యలు గల్లవారము**
**వేట మనదే వెట్టి మనదే – వేయి విద్యలు గల్లవారము**
**కొలువుమనదే కొలత మనదే – కోటి విద్యలు గల్లవారము**
**ఆడవాలె పాడవాలె – వేడుకలు చేయవాలె**
**అచ్చుకోడ లయ్యోకోడ–లా లచ్చిరి బాలకోడలా**
**వీట్లంకాము విద్దెలంకాము – వేడుకల బాలలము**
**జంగంకాము జోగుకాము – జోటలుండే బాలలము**
**అమ్మవారు యున్నప్పుడు – ఆడేపాడే బాలలము**
**మనసును మంచివారము – మా పటికి దొంగవారము**
**లిల్లి బూచో లిల్లేలేవో – లల్లకాదు బాలకోడలా**

**విశాఖ మన్యం ప్రాంతీయత**

విశాఖమన్యం చలికి మంచుకు ప్రసిద్ధి. కావిరి, గాందు, బుగ్గిమంచు, బడిమంచులు 'బుడి బుడి ముంత భూమేలు ముంత – మధ్య మధ్యముంత మాయలది ముంత' అన్నట్టు

"పొగలు బండికి పారిపోగా – పడాలు మరిదిని పిలయబోదాం" అని ఉవ్విళ్ళూరే ప్రేమికులను మోసగిస్తాయి. ఒకనాడు మన్యం తిరిగే బుర్రకథల వారు కూర్చిన పాట ఇది.

**నీకు నేను వస్తానని తందాన ఓ తాన తందన**
**చుక్కలకుర బాస చేసిర ఓ రామ ఓరామ రాఘువా**
**చుక్కలకు మొక్కకొనిర – తందానె అయ్యోతందానె తాన తందానాన**
**పాపకారిర ఓ వేగుచుక్కవో – ఓ దేవనందనాన – తేలకుందని తెల్లవారెను**
**గాందుగాంధరి వేళలకువో – ఘాటీయావలె తెల్లవారెను.**
**మాయదారిర వేగుచుక్కవో – మన్నెమివకడె తెల్లవారెను**

చుట్టూ కమ్ముకొన్న మంచులో చుక్కపొడుపు కనిపించలేదు. బుగ్గిమంచులో అడుగులు వడివడిగా పండక ఘాటీ తేలకముందే తెల్లవారింది.

ఈ మన్యంలో చింతపల్లి గూడెం మండలాలు 'చలిగూడంఎ' గంగరాజు మాడుగుల కొండపట్టె గ్రామాలు 'ఆరుళ్ళ' (ఆరు+ఊళ్ళ). రెండు పంటలు పండేవారికి రెండాకళ్ళూ. మండలంలోనే పల్లం 'పసిబయలు' పసుపు పండే ప్రాంతం. ఈ పసుపు సంత వడ్డాది. 'వళ్ళు వడ్డాది పసుపు కావాలి' అని నానుడి. పాడేరు మండలం 'దోరశి' 'దొంతికుండ దోరశి' అంత ఆహార సమృద్ధి. పిప్పలి పంటకు పెద్ద సంత ఈ ధోరణి లోనిదే. గంపరాలు వద్ద మత్స్యగడ్డకు కోట్ల దాటు జోరె అని పేరు. ఆవల కోట్లదేశం 'జాన్లె కోట్ల, నజాన్లె కత్రారు బంట' అని కోదు సామెత. తెలిస్తే కోట్ల తెలియకపోతే కత్తుల బాట అని అర్థం. హుకుంపేట నుండి 'బయలు' ప్రాంతం. కొండ దిగువ ప్రాంతం 'గాళ్ళ'. 'గాళ్ళవారికి అన్నం మీద ఆశ' అని దిగువ వారిని గిరిజనులు ఎత్తిపొడుస్తారు. గిరిజన ప్రాంతంలో 'అన్నం వార్చుకున్నా అంబలి కుండ తప్పదు'.

'అతుకులు బొతుకులది ఆలపదం' – 'చితుకులు బొతుకులది సీతపదం'; 'సీతకథకు చిందులు విందులు'; లొల్లోసి, తుమ్మెద, ఆల, కోలాటి, అచ్చుకోడళ్ళు; వంటి పల్లవులకు తగిన గుమ్మలు, నందాలు, గుందేరి, సపిరె, చాపచుట్టు, గుళ్ళచుట్టు వంటి ఆటలేకాక, విశాఖ మన్యంలో వారి సాంఘిక, ఆర్థిక దార్శనికతకు, విధానాలను దృక్పథాలను, చాటే గేయగాథలు, పండుగ పదాలు, ఉత్పత్తి సంబంధాల న్యాయమీమాంసతో నిండిన కథలుకూడా వినిపిస్తుంటాయి.

**పాండవదేశం**

మన దేశమంతటా పాండవరాజులు పంటభాగ్యాలకు అధిదేవతలు. వారు గిరిజనుల ఆదర్శమూర్తులు. విశాఖ గిరిజనప్రాంతం, వడ్డాది మత్స్యరాజ్యంలో భాగం. శృంగవరపుకోట వెళ్లేదారిలో పుణ్యగిరి వారి విరాట పర్వతం, లంబసింగిలో నిలువెత్తు పాండవుల విగ్రహాలున్నాయి. గొలు(గొల్ల)గొండ రాజ్యంలోని గూడెంలో శిథిలమైన శ్రీకృష్ణదేవాలయ ఉంది. మత్స్యరాజ్యంలో ప్రాదేశిక కేంద్రం పిట్టగడ్డ. మన్యం ఇలవేల్పు మోదమ్మ ఆఖరుచెల్లెలు ముప్వలమ్మ దేవాలయం జాలంపల్లిలో ఉంది.

తన సంతానాన్ని నాగరాజులు కబళిస్తుంటే, వాటిని మత్స్యలింగేశ్వరుని రక్షణలో ఉంచి, మత్స్యదేవత గమ్మేలివద్ద మత్స్య పర్వతంలో తన బలగాన్ని నాగరాజులతో యుద్ధానికి సన్నద్ధం చేస్తుందని మత్స్య గుండం స్థల పురాణం.

**"విరాటవారి దేశం విటుకపండుగలు**
**కొండవారి దేశం కొలువు పండుగలు**
**కాశివారిదేశం గంగపండుగలు**
**జోరజోరజోర – పంచపాండవులార**
**పిట్టగద్దజలంపల్లి – పట్టపు కోలన్న"**

అంటూ పాట పూజారులు నందిపండుగలో పాడుతుంటారు.

అంబటూలరాజు భార్య అన్నమూలదేవికి కన్నెరికాన పుట్టినవాడు కోలన్న 'పిట్టగద్ద జలంపల్లి పట్టపు కోలన్న' అంటూ గిరిజనులు కోలన్నను ఆహ్వానిస్తారు. కోలన్న అంటే కొలువుగాడు బారిక. కోలన్న/కర్ణుడు తమతో చేరినప్పటికీ, ఇంకా కౌరవులను గెలవలేకపోయామని, ఇప్పటికీ తమకష్టం 'పంచపాదవుల పంట – దుర్యోధనుడి వంట'గా దిగువవారికే చేరుతుందని 'కోండోడి పోడు కోమటోడి సంచి' 'పల్లాన పదివేయుల మాయలు' కొండసంతలలో 'తూరుపు కుంచముతో తూలగొలిచిన బేరగాడు–పడమర కుంచముతో పారగొలిచిన బేరగాడు' అని తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కుతుంటారు. సంప్రదాయ సరిహద్దులు, ఉమ్మడి కట్టుబాట్ల స్థానంలో రెవిన్యూ, ఫారెస్టు వారు కొత్త సరిహద్దులు గీసి, కోర్టు డిక్రీలతో, బీదరైతులను పొలాల నుండి పోలీసు బలగంతో తొలగిస్తూ, ఎదురు తిరిగిన ముఠాదారులను తీసివేస్తూ, బ్రిటీష్ ప్రభుత్వం వేధించసాగింది. పాండవరాజ్యం రావాలంటూ పాట పూజారులు తిరుగుబాటుకు పురిగొల్పుతున్నారని 1870లో నాటి జిల్లా కలెక్టర్ మద్రాసుకు వర్తమానం పంపాడు.

**రంపగణింపరాని జనరాశిని జంపెడుదుంప కాన్సిస్టేబుల్**
**గుంపులపెంపు సొంపణప గూర్చిన ఆ జముకొంప, దొర్ల మా**
**యింప జనించు కొంప, ధరణీశుల టొంప, పితూరీదార్లకున్**
**సంపదలిచ్చి ప్రోచుటకు చాలిన మేరువు చెంప ఇమ్మహిన్**

'అన్ని డిపార్ట్‌మెంట్లు అనుకూలమేగాని ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ పరమ శత్రువు' 'మనకొద్దీ ఫారెస్ట్ కట్టు, పంటకు పన్నేస్తాడు చెట్టుకు పన్నేస్తాడు, చీటీ పొందక పోతే జైలుకు పంపిస్తాడు !', 'గాంధీతత్త్వమెల్ల గాజులు గలవారి మోజు నందుచునుండెరాజ వారు తన్నరు కొట్టరు రాజ' అంటు గాంధేయ మార్గాన్ని నిరసించారు. పితూరీల తరువాత శాంతియుతంగా 'మిత్తికోసం గొత్తి పని', 'మినుములూరు ఘాట్‌రోడ్డు రావాలి – ముఠాదారుకట్టుపోవాలి' అంటూ గూడెం, రంప పితూరీల తరువాత శాంతియుతంగా ఉద్యమించారు.

**మోదకొండమ్మ పదం**

కొండదిగువన వడ్డాది మత్స్యరాజులకు, తూర్పు కనుమలలో ప్రాచీన రాజధాని నందపురంవారికి కుండమార్పిడి బంధుత్వం ఉంది.

ఓ- 'అందమైన నందపురం - నంది ఆటలు ఆడివద్దాం
తియ్యగుమ్మడి తీసివద్దాం - మళ్ళుగుమ్మడి మరలివద్దాం'

అని గిరిజనులు పాడుతుంటారు.

వడ్డాదిరాజు దేవేంద్రుడి భార్య నందపురం ఆడపడుచు రాచగన్నియ. వారి సంతానం మోదమ్మ మొదలైన దుర్గాండ్లు, ఈదుర్గాండ్లకు దేవేంద్రుడు దిగువ సంబంధాలు చూస్తుంటారు. ఇంతలో నందపురం యువరాజులు దేశిరాజులు - దుర్గాండ్లు, కల్యాణపులోవలో దొంగపెండ్లిండ్లు అంటే గాంధర్వ వివాహం చేసుకుంటారు. ఇందుకు కోపగించిన దేవేంద్రరాజు అల్లుళ్ళకు ఏడుగడియల శిక్ష వేస్తాడు. అవమానభారంతో దేశిరాజులు, రాచగన్నియ ఆత్మహత్య చేసుకుంటారు.

అప్పటికి మోదమ్మ గర్భవతి. ఆమె కొడుకు సంజీవ రాజు, నందిపదంలో కోలన్న సామాజిక వర్గానికి చెందిన మాలగంగును ప్రేమిస్తాడు. అటువంటి విలోమసంబంధాలను గిరిజనుల కట్టుబాటు ప్రకారం వెలివేయాలి, వెలికి గురిఅయిన వారు రాజ్యార్హత కోల్పోతారు. దిగువప్రాంతాలలో ఉంపుడుగత్తెగా ఉండవచ్చు. అలా ఉండడం మాలగంగుకు ఇష్టం లేదు.

వెలివేస్తే తండ్రులవలె చిన్న బుచ్చుకొని ఏ అఘాయిత్యానికి పాల్పడతాడోనని భయపడిన దుర్గాండ్లు, నందపురంలో పెద్దరాణి మాకలిశక్తికి కబురు పంపుతారు.

మాకలిశక్తి, గంగ-సంజీవరాజు ఈడు జోడులకు సంతోషించి వెలి వంటి అమానుషమార్గాలు, ఉంచుకోవడంవంటి వక్రమార్గాలు నిరసించి కులాలమధ్య అడ్డుగోడలను తోసిరాజని వారిరివురికి పెండ్లి చేసి ఇరురాజ్యాలకు పాలకులుగా పట్టాభిషేకం చేస్తుంది.

"ఓ శరణు శరణు దుర్గాలమ్మలు - మీ చరణాలు తప్పలేము
మీ చరణాలు తప్పినకాని - మీ కరుణాలు తప్పలేము
మీలాటి కాలమురాగా - మిమ్ము తలచిపాడుతాము"

అంటూ గిరిజనులు ఈమోదమ్మపాట పాడుకుంటారు.

**క్షేత్రప్రధానం - బీజప్రధానం: న్యాయమీమాంస**

గిరిజనసమాజం గతిశీలం. ఆ గమనంలో వచ్చే కుదుపులకు చర్చించి సర్దుకోగల ప్రగతిశీలం వారి కథలలో కనిపిస్తుంది.

అడవిలో ఒక పోతుపిట్ట, పెంటిపిట్ట కాపురం చేస్తున్నాయి. పెంటిపిట్ట గుడ్లుపెట్టి పొదుగుతుంది. ఇంతలో వేటలవారు అడవికి అగ్గిపెట్టారు. చుట్టుముడుతున్న కార్చిచ్చును చూసి భయపడిన పోతుపిట్ట, పెంటిని, పారిపోదామని తొందరపెట్ట సాగింది. ముక్కు పచ్చలారని పసిపిల్లలను వదిలిపెట్టి పోవడానికి ఆ తల్లి మనసు అంగీకరించదు. పోతుపిట్ట వాళ్ళను వదిలేసి పారిపోయింది. తల్లి అగ్గి దేవుడిని ప్రార్థించింది. అగ్గి చల్లారింది.

పోతుపిట్ట, పెళ్ళాం పిల్లలు ఏమైనారో చూడడానికి వస్తుంది. భార్య, భర్త పోట్లాడుకుంటారు. పిల్లలు తనవారేనంటూ వారిని తీసుకుపోతానంటూ భర్త – ఇవ్వనంటూ పెంటి, తగవు పడతారు. రాజుదగ్గరకు తీర్పుకు పోతారు.

ఆ రాజుకు ఏడుగురుపెళ్ళాలు. వాడో మూర్ఖుడు. ఒక పెళ్ళాంకూడా వాడికి సరిగా చూడదు. తల్లివే పిల్లలు అని తీర్పు చెపితే, రేపు తన పెళ్ళాలు, పిల్లలు తనను వదిలేస్తారేమోనని వాడి భయం. ఒక శాస్త్రం చెప్పి తీర్పు మళ్ళిస్తాడు. కొండపోడులో చోడివిత్తనం వేస్తే చోడి చేను, జొన్నవిత్తనం వేస్తే జొన్నచేను అంటారు కదా! విత్తనానిదే పంట. తండ్రికే పిల్లలు – ఇది అతని తీర్పు.

కష్టపడి పెంచుకున్న పిల్లలు తనకు దక్కనందుకు ఆక్రోశంతో పెంటిపిట్ట అగ్గిదేవుడిని పిలిచి, ఆ మంటలో ఆహుతి అవుతుంది. మరుసటి జన్మలో ఆ ఊరులోనే ఒక జంటకు కూతురు చిలకమ్మగా జన్మిస్తుంది. వారం వారంసంతలో చిరుతిండి కొనుక్కోడానికి చిలకమ్మకు తలిదండ్రులు చిల్లర డబ్బులిస్తారు. అవి ఖర్చుచేయకుండా కూడబెట్టుకుంటుంది.

ఆ ఊరి రాజుకు (మన పాతరాజే) సంత చేయడానికి డబ్బులు లేవు. చేబదులుకోసం, చిలకమ్మ తలిదండ్రుల దగ్గరకు వస్తాడు. చిలకమ్మ దాచుకున్న డబ్బులివ్వడానికి ఒప్పుకొని రాజుదగ్గర ఉన్న మచ్చలకోడె దూడను కొనుక్కుంటుంది.

వర్షాకాలంలో పశువులన్నింటిని కొండకు తోలతారు. పంటలు ఇంటికి చేరాక పశువులు ఊళ్ళోకి వస్తాయి. ఆ వచ్చినవాటిలో మచ్చలున్న లేగదూడలను చిలకమ్మ తనదొడ్డిలో కట్టేయసాగింది.

'ఏదో సరదా పడుతుందిలే' అని కొన్నిరోజులు ఊరివారు ఊరుకున్నారు. అవి తనవేనని ఆమె పట్టు పట్టడంతో, తగవు, రాజు వద్దకు చేరుతుంది. 'విత్తనానిదే చేను అని తీర్పు ఇచ్చావు కదా. నేను కొన్న మచ్చల కోడెదూడకు పుట్టిన దూడలన్నీ నావే'నని ఎదురు వాదించింది చిలకమ్మ.

ఇటువంటి ఎదురుసవాలు విసిరే గడుసు వాళ్ళుంటే, తన పెత్తనం సాగదని రాజుకు అర్థం అయింది. చిలకమ్మ తలిదండ్రులను ఏదో విధంగా ఒప్పించి. ఆమెను పెళ్ళాడి, ఒక మేడలో బంధించాడు. చిలకమ్మ మురుదెలుక / పందికొక్కు సాయంతో, రాజు, రోజూ స్నానానికి వెళ్ళే చెరువుకు సొరంగమార్గం తవ్వించింది. ఒకరోజు తెల్లవారకముందే చెరువులో తామరాకుమీద కూర్చుంది. ఆమెను, వేరే పిల్లగా భ్రమించి. 'ఒంటరిగా దొరికింది పిల్ల' అనుకుంటూ రాజు ఆమెను సమీపించపోయి. తామరతూళ్ళలో చిక్కుకొని మరణిస్తాడు.

రాజు ఏడుగురు భార్యలు, శవం చూడడానికి వస్తారు. చిలకమ్మ రాలేదు. చిలకమ్మ మేడద్వారాలు పగులగొట్టి చూస్తారు. ఇంతకాలం తిండితిప్పలులేక కృశించిన చిలకమ్మ, తన అడ్డు తొలగించుకోవాలని తనను పెళ్ళి చేసుకొని బంధించిన, రాజు మనస్తత్వం అందరిముందు రట్టు చేసింది.

పంచపాండవులు ఇంకా దుర్యోధనుడిని గెలవలేదు. అంటూ పాడుకునే నందిపదం, ఈ చిలకమ్మ కథ గిరిజన సమాజంలో పేరుకుపోతున్న కసిని స్పష్టం చేస్తున్నాయి. మోదమ్మపాట ఒకరినొకరు అర్థం చేసుకోక పోతే, కలుపుకోక పోతే ఈ సమాజం భవిష్యత్తు విషాదాంతం కాక తప్పదని హెచ్చరిస్తుంది.

ఉత్తరాంధ్ర మాత్రమే కాదు, తెలుగుజాతి, మానవజాతి ఈ గిరిజనవాఙ్మయంనుండి గుణపాఠం నేర్చుకుంటుందని వారి సాహిత్యం మనకు దారి చూపిస్తుందని ఆశిస్తూ... 'తెలుగు గిరిజన గీతాలు' (1991) పరివర్ధిత ముద్రణ 'కొండకోనల్లో తెలుగు గిరిజనులు' (2007) ఆఖరు పేరాతో ఈ ప్రసంగం ముగిస్తాను.

'ఈ అడవుల్లో పర్యటన ధైర్య సాహసాలను, గిరిజనుల వాఙ్మయం ఎనిమిది కోట్ల తెలుగు ప్రజలకు, ప్రపంచానికి జ్ఞానభిక్షను, వారి ఆటపాటలు మనో వికాసాన్ని, వారి సంస్కృతి అధ్యయనం మానవత్వ విలువలను పెంచుతుంది.'

---

– గిరిజన సంస్కృతిమీద శక్తి ప్రచురణలు www.sakti.in ప్రచురణలో చూడవచ్చు. సేకరించుకోవచ్చు. saktisrk@yahoo.com ను సంప్రదించవచ్చు. చిరునామా : **శక్తి శివరామకృష్ణ,** 305, జనప్రియ అబోడ్స్, గాంధీనగర్, హైదరాబాదు–500 080, సెల్ : 9100931658